రజకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: రజకుల సంక్షేమానికి కృషి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పట్టణ శివారులో రజకుల సౌకర్యార్థం రూ.2 కోట్లతో నిర్మించనున్న దోబీఘాట్‌కు కలెక్టర్ శశాంకతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. పలు పార్టీలకు చెందిన రజకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి మాట్లాడుతూ.. రజకులకు రాష్ట్రంలోని 141 మున్సిపాలిటీల్లో రూ.282 కోట్లు ఖర్చు పెట్టి ఆధునిక దోబీఘాట్లను నిర్మిస్తుందన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ రజకులకు గౌరవం కల్పించిందన్నారు. తొర్రూరులో రజకులకు కమ్యూనిటీ భవనం, చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కమిషనర్ సరస్వతి, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు కర్నె నాగజ్యోతి, రేవతి, నాయకులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు, పక్కన కలెక్టర్ శశాంక

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లోకి..

పెద్దవంగర: పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధిని చూసే కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో వస్తున్నారని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని కొరిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోమరాములు, అంజయ్య, సోమయ్య, రాములు, దయాకర్, రవీందర్, చిన్న వెంకన్న ఎర్ర వెంకన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో మంత్రి సమక్షంలో చేరారు. మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముస్లింలకు సర్కారు చేయూత

మరిపెడ: ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డోర్నకల్ నియోజకవర్గంలో ముస్లిం మహిళలకు మంజూరైన కుట్టుమిషన్‌లను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్‌తో కలిసి పంపిణీ చేశారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా దీవించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూర, ఎంపీపీ గుగులోతు అరుణ, జెడ్పీటీసీ తేజావత్ శారద, మున్సిపల్ వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష

చిన్నగూడూరు: కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. నర్సింహులపేట మండలం లోక్యాతండాకు చెందిన పలువురు శుక్రవారం మండలంలోని ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


మరిపెడ: కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

మసీదు ప్రారంభం



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీలోని శనిగపురం గ్రామంలో మహమ్మద్ ఉస్మాన్ సహకారంతో నూతనంగా నిర్మించిన మసీదును ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ సీతామహాలక్ష్మీ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిపి, అన్నదానం చేసి మసీదు నిర్మాణానికి సహకరించిన మౌలానా అబ్దుల్ లతీఫ్ రషీదీ, షేక్.యూసుఫ్ మేస్త్రీని సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్ద మౌలానా అబ్దుల్ లతీఫ్ రషీదీ, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, యాళ్ల మురళీధర్ రెడ్డి, ఖాదర్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

కనకయ్యకు టికెట్ ఇవ్వొద్దు

గార్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వొద్దని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఎద్దు రవి టీపీసీసీ అధిష్టానంను కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే గెలిపించామని, గెలిచిన 6నెలలకే కనకయ్య బీఆర్ఎస్ పార్టీలో చేరారని, మళ్లీ ప్రస్తుతం కనకయ్య కాంగ్రెస్ పార్టీలో చేరి ఇల్లందు ఎమ్మెల్యే టికెట్‌కు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సీహెచ్ జనార్దన్, ఎస్‌డి హకీమ్, ఎద్దు నాగరాజు, వట్టం నాగేశ్వరరావు, భద్రమ్మ, వెంకన్న, కుమార్, రామలక్ష్మణులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లికుదురు: ఈనెల 25న తొర్రూర్‌లోని రామ పేందర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న జాబ్ మేళాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం వరదయ్య కోరారు. శుక్రవారం మండలలలోని వివిధ గ్రామాలల్లో సీసీలతో కలిసి విస్తృత ప్రచారం చేశారు. పదో తరగతి ఆపైన చదువుకున్న 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వానరాల పట్టివేత

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో కోతుల సమస్య ఎక్కువగా ఉండడంతో వాటిని అరికట్టేందుకు తగు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ టి.ప్రసన్నరాణి శుక్రవారం తెలిపారు. ఈనెల 19వ తేదీ వరకు 1,137 కోతులను పట్టారన్నారు.

విచారణ చేపట్టాలి

కొత్తగూడ: తునికాకు కూలీలకు చెల్లించే బోనస్ డబ్బుల చెల్లింపుపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు బూర్క వెంకటయ్య మాట్లాడుతూ.. 2016 నుంచి 2022వరకు తునికాకు కూలీలకు చెల్లించాల్సిన బోనస్ డబ్బులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అవి కూలీలకు చెల్లించే క్రమంలో అటవీ శాఖ అధికారులు మరి కొందరితో కలిసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, సోమన్న, బుచ్చిరాములు, పుల్లన్న, జీవన్, యుగెందర్, రాజమల్లు, దేవేందర్,పూర్ణచందర్, రాంచంద్రులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

మహబూబాబాద్: రాష్ట్రంలో అత్యంత కీలకమైన వ్యవసాయరంగంలోని పాడి పరిశ్రమ బాగోగులు చూసే పశుమిత్రలకు వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పశుమిత్రలు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో రాజమౌళి, యూనియన్ నాయకులు రజిని, శారద, ఝాన్సీ, అనూష, ఏలేంద్ర పాల్గొన్నారు.

25న మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా


మాట్లాడుతున్న కుంట ఉపేందర్

నెహ్రూసెంటర్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాల చెల్లింపునకు బడ్జెట్ విడుదల చేసి కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా కుంట ఉపేందర్ మాట్లాడుతూ.. 2022 మార్చి 15వ తేదీన అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ. 2వేల అదనపు వేతనం నేటికి అమలు కాలేదన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రమాదబీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈనెల 25న మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా ఉందన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు తోట పుష్ప, రాధిక, యాకమ్మ, రాణి, సుగుణమ్మ, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

సాగు భూమిని లాక్కోవడం అన్యాయం

గూడూరు: మండల కేంద్రంలోని చెంద్రుగూడెం సమీపంలోని సర్వే నంబర్ 298/1లో గల 10ఎకరాల సాగు భూమిని అధికారులు ఏకలవ్య పాఠశాల నిర్మాణం కోసం లాక్కోవడం అన్యాయమని సాగు రైతులు బి.లాలు, బాలు, వాల్య, రాములు, దేవి, శంకర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. 50 ఏళ్ల నుంచి వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నామన్నారు. అందులో వ్యవసాయ బావులకు కరెంటు లైన్‌లు, భూమి శిస్తు కట్టిన రశీదులు ఉన్నా, మండల అధికారులు అది ప్రభుత్వ భూమిగా తప్పుడు రికార్డులు చూపుతూ, అందులో ఏకలవ్య పాఠశాల నిర్మించాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆర్డర్‌ను లెక్క చేయడం లేదన్నారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తున్న ప్రభుత్వం, అధికారులు, ఎమ్మెల్యే సాగు భూములను పరిశీలించి, న్యాయం చేయాలని వేడుకున్నారు.

సన్మానం

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రామసహాయం శ్రీధర్ రెడ్డిని పదో తరగతి (1986–87బ్యాచ్) మిత్ర బృందం శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు టై, బెల్టులను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.రమేష్ బాబు, సంస్థ సభ్యులు మేకల కృష్ణయ్య, బొక్క వెంకట్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, మిత్రులు బిర్రు వెంకటనారాయణ, సంద శ్రీను పాల్గొన్నారు.

గణేశుడికి ఘనంగా పూజలు


చిన్నగూడూరు: అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్


గార్ల: జెండాబజారులో గణేశుడి వద్ద కుంకుమ పూజలు


మానుకోటలో విగ్రహం వద్ద భవ్యశ్రీ


డోర్నకల్: వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న బాలికలు


మహబూబాబాద్ రూరల్: పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ పుష్పలత, స్థానికులు


నెల్లికుదురులో చిన్నారి..

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి


దీక్షలో పాల్గొన్న సంఘం నాయకులు

మహబూబాబాద్: పెండింగ్ స్కాలర్ షిప్‌లను, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు, సాయి కుమార్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం దీక్ష చేపట్టారు. దీక్షను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో దీక్షకు కుంట ఉపేందర్, నాగన్న , రాజమౌళి మద్దతు తెలిపారు. దీక్షలో సూర్య ప్రకాష్, సింహాద్రి, మహేశ్వరి, సమక్క, లిఖిత, కావ్య, పూజిత, తరుణ్, హేమంత్, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా మోసం


మాట్లాడుతున్న ఎల్లయ్య

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా మాదిగను కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తుందని ఎంఆర్‌పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కోండ్ర ఎల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. న్యాయమైన పోరాటంగా 28ఏళ్లుగా పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టి వర్గీకరణకు ఆమోదించాలని డిమాండ్ చేశారు. మాదిగలను మోసం చేస్తున్న పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాల ఎల్లయ్య, సీహెచ్ రాధా, కుక్కల సుధా, సంధ్య, ఎల్లయ్య, నాగమణి, విజయలక్ష్మీ, యశోద, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె


దంతాలపల్లి: కలెక్టర్ శశాంకకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

మహబూబాబాద్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌సారథిరెడ్డి, ఆకుల రాజు, ఉపేందర్, నాగన్న, నవీన్, స్నేహబిందు, ఎల్లారీశ్వరి పాల్గొన్నారు.

గూడూరు: ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎండి. యాకూపాషా కోరారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. సమ్మెకు వారు మద్దతు పలికారు. ఈసందర్భంగా మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్ అందించిన రూ.5వేలను అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించారు.

కలెక్టర్‌కు వినతి

దంతాలపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ శశాంకకు అంగన్‌వాడీలు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తొర్రూర్ ఆర్డీఓ నర్సింగరావు, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ నజీముద్దిన్ పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిరసన

గార్ల: గార్లలో అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాసరావు, టీచర్లు పాల్గొన్నారు.

వట్టివాగు బ్రిడ్జి పైనుంచి వరదనీరు

● నిలిచిపోయిన రాకపోకలు
● కేసముద్రంలో అర్ధరాత్రి భారీ వర్షం

కేసముద్రం: మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని అంబేడ్కర్‌సెంటర్, సంతోష్‌నగర్ కాలనీ జలమయంగా మారింది. ఇళ్ల ముందు వరదనీరు నిలిచిపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా అండర్ డ్రెయినేజీ నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో రైల్వేట్రాక్ ఇరువైపుల నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా మండలంలోని అర్పనపల్లి గ్రామంలో గల వట్టివాగు బ్రిడ్జి పైనుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో, గూడూరు–కేసముద్రం మండలాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని అర్పనపల్లి గ్రామంలో గల వట్టివాగు బ్రిడ్జిని, వరద ఉధృతిని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్, బుచ్చిరాములు, చాణక్య, నాగరాజు, రవి, కమలేష్ పరిశీలించారు.


కేసముద్రంస్టేషన్‌లో జలమయంగా సంతోష్‌నగర్ కాలనీ

సంక్షిప్త సమాచారం

గల్లంతైన మృతదేహం లభ్యం

మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామానికి చెందిన మోడెం వెంకన్న మున్నేరువాగులో పడి గురువారం గల్లంతైన విషయం తెలిసిందే. జరిగిన సంఘటనపై వెంకన్న సోదరుడు రవి రూరల్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా ఎస్సై రాంచరణ్ కేసు నమోదు చేశాడు. గాంధీపురం గ్రామ శివారు మున్నేరువాగు ప్రవాహంలో ఒక మృతదేహం కొట్టుకువచ్చినట్లు సమాచారం వచ్చింది. వెంకన్న బంధువులు, పోలీసులు వెళ్లి పరిశీలించి మృతదేహం మోడెం వెంకన్నదిగా గుర్తించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బయ్యారం: న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు ముఖ్తార్‌పాషా వర్ధంతి సభలను ఈనెల 24నుంచి 30వరకు గ్రామగ్రామాన నిర్వహించాలని పార్టీ ఖమ్మం–వరంగల్ ఏరియా కమిటీ నాయకులు మోకాళ్ల మురళీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం బయ్యారంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, నాగేశ్వరరావు, భిక్షం, వీరభద్రం, నర్సింహా పాల్గొన్నారు.

బ్యాంకర్ల పేరుతో ఫోన్ చేస్తే స్పందించొద్దు

పెద్దవంగర: అపరిచిత వ్యక్తులు బ్యాంకర్ల పేరుతో ఫోన్ చేస్తే స్పందించదని తొర్రూరు మండల శాఖ ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ సుజిత పేర్కొన్నారు. శుక్రవారం చిట్యాల గ్రామంలో బ్యాంకు లావాదేవీలపై ఫీల్డ్ ఆఫీసర్ మహేందర్ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించి అవగాహన కల్పించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కురవి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జీపీ కార్యదర్శి దివాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లోని ఇళ్లను పరిశీలించారు. వీఓఏలు సంగెం రమాదేవి, ఝక, అబీబా, ఎఎన్‌ఎం కుమారి, ఆశాలు వినోద, పాల్గొన్నారు.

గిరిజన హక్కులను పరిరక్షించాలి

డోర్నకల్: గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంగోత్ వెంకన్న డిమాండ్ చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని నమ్మకల్ జిల్లా కేంద్రంలో మూడురోజులపాటు జరిగిన ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్(ఆర్మ్) జాతీయ మహాసభల్లో ఆయన పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడలకు ఎంపిక

దంతాలపల్లి: ఈనెల 25, 26 తేదీలలో మండల కేంద్రంలో గల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ తొర్రూర్ జోనల్ స్థాయి క్రీడల ఎంపిక నిర్వహించనునట్లు కన్వీనర్ వేణుమాధవ రెడ్డి, పీడీ ప్రవీణ్ శుక్రవారం తెలిపారు.

బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలి

చిన్నగూడూరు: పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దేశగాని కృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా బిల్లును స్వాగతిస్తున్నామని తెలిపారు.


మిరప పంటల పరిశీలన

దంతాలపల్లి: మండలం తూర్పుతండా గ్రామ పంచాయతీ పరిధిలో గల మిరుప పంటలను శుక్రవారం మండల వ్యవసాయ విస్తరణ అధికారి సందీప్ పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప పంటలో తెల్లదోమ, తామర పురుగు, ఆకు ముడుత ఉధృతిపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

రిటైర్డ్ రైల్వే లోకోపైలెట్ మృతి

డోర్నకల్: రైల్వే రిటైర్డ్ లోకోపైలెట్ కొండేటి స్వామి(76) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. స్వామికి నలుగురు కుమారులు, కుమార్తె ఉండగా పెద్ద కుమారుడు హేమచంద్రశేఖర్ కౌన్సిలర్ పదవీలో కొనసాగుతున్నాడు.

'రామేశ్వరం టు కాశీ' సైకిల్ యాత్ర



కురవి: రామేశ్వరం నుంచి కాశీకి సైకిల్ యాత్ర చేస్తున్న సైకిల్ యాత్రికుడు శుక్రవారం కురవి మండల కేంద్రానికి చేరుకున్నాడు. కర్నాటక రాష్ట్రం బెంగుళూరు సమీపంలోని సుబ్బన్నపాలెంకు చెందిన ఎం.ముత్తుకుమార్ దేశ హితం కోసం ఈ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు.

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం..

గూడూరు: జ్యాతి బాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 150వ ఆవిర్భావం సందర్భంగా ఈనెల 24 నుంచి 30 వరకు కుల నిర్మూలన, కుల వివక్ష దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ సబ్ డివిజన్ కమిటీ సభ్యుడు గజ్జి లింగన్న శుక్రవారం పిలుపునిచ్చారు. అచ్చన్న, రణధీర్, శ్రీశైలం, జీవన్ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్

గూడూరు: తెలంగాణ అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్ అని జెడ్పీ కోఆప్షన్ ఎండి.ఖాసీం అన్నారు. మండలంలోని మట్టివాడ, కొంగరగిద్ద, నేలవంచ, తిమ్మాపురం, ఊట్ల, శ్రీహనుమాన్‌తండా, మచ్చర్ల జీపీల పరిధిలోని 21 చెరువులలో శుక్రవారం మత్స్యపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను చెరువులలో వదిలారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఈసం సంధ్యాసూర్యనారాయణ, సపావట్ రాజు, జ్యోతి, ఉమ్మా, మాజీ ఎంపీపీ రేగ వెంకటేశ్వర్లు, మండల కోఆప్షన్ రహీంపాష పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

పెద్దవంగర: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన చేప పిల్లలను శుక్రవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ కులస్తులకు అందజేశారు.

పంటలసాగు విధానంపై శిక్షణ

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామంలో శుక్రవారం కృషివిజ్ఞాన కేంద్రం, మల్యాల ఆధ్వర్యంలో పసుపు, మిర్చి, వరి, పత్తిపంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త రాంబాబు మాట్లాడుతూ..ప్రస్తుతం మిరపలో పైముడత, లద్దెపురుగు ఉధృతి ఉందని, రైతులు జాగ్రత్త వహించి పంటలను కాపాడుకోవాలన్నారు. సర్పంచ్ యాకయ్య, కేవీకే శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, భద్రు, రైతులు పాల్గొన్నారు.

దిగబడిన లారీ.. తప్పిన ప్రమాదం



కేసముద్రం: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు వెంట ఉన్న గుంతలో చక్రాలు దిగబడి, ఒకవైపుకు ఒరిగిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. డ్రైవర్ అప్రమత్తంతో ప్రమాదం తప్పినట్లయిందని స్థానికులు తెలిపారు.

క్రైం కార్నర్..

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

దంతాలపల్లి: మండలకేంద్రంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గున్నెపల్లి గ్రామానికి చెందిన మహేష్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. మహేష్‌కు భార్య శోభ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మహేష్ తాగి తరుచూ భార్యతో గొడవ పడుతుండడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో పెద్దమ్మ పిచ్చమ్మతో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం తాళం వేసి ఉన్న ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో పిచ్చమ్మ గ్రామస్తులకు చెప్పింది. తలుపులు పగలకొట్టి చూడగా మహేష్(35) చనిపోయి ఉన్నాడు. మృతదేహంపై శరీరం ఊడిపోయి, చేతులపై కత్తి గాట్లు, శవం పక్కనే కత్తి ఉంది. విషయం పోలీసులకు తెలుపగా సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై రమేష్ బాబు ఉన్నత అధికారులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న తొర్రూర్ టౌన్ సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసుకొని శవాన్ని పంచనామ చేసి పరీక్ష నిమిత్తం మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో మహారాష్ట్ర మహిళా కూలి..

మరిపెడ రూరల్: విద్యుదాఘాతంతో మహారాష్ట్రకు చెందిన మహిళా కూలి మృతి చెందింది. వివరాలు.. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా సొల్లి మండలం యాడ్‌భూజ్ గ్రామానికి చెందిన గుర్రుమలే పూర్ణిమ(35) భర్త ముఖేష్, ఇద్దరు పిల్లలతో కూలి పనుల కోసం మండలంలోని భూక్యతండాకు వచ్చారు. బీచ్‌రాజ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జర్పుల తండాకు చెందిన బానోతు అర్జున్ ఇంటి నిర్మాణ నిమిత్తం కూలికి భార్యాభర్తలు వెళ్లారు. ఈనేపథ్యంలో ఇనుప చువ్వ తీసుకెళ్తుండగా విద్యుత్ తీగలకు తగిలి పూర్ణిమ షాక్‌కు గురైంది. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది.

ఒకరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: పలువురికి ప్లాట్లు విక్రయించి వారికి రిజిస్ట్రేషన్ చేయకపోవటంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకరిపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై రాంచరణ్ శుక్రవారం తెలిపారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్ స్థానిక ఆర్తి గార్డెన్స్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 181/డీ/1లో 2006లో ఒక్కొక్కటి 133 గజాల చొప్పున ప్లాట్లుగా చేసి పది మందికి విక్రయించాడు. నాటి నుంచి నేటి వరకు ప్లాట్లను కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ చేయలేదు. దీంతో పెసర వెంకటరెడ్డి అనే కొనుగోలుదారుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


ఆమనగల్ గ్రామంలో ఒకరు..

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఆమనగల్ గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి శ్రీకాంత్ రెడ్డిని అదే గ్రామానికి చెందిన తేళ్ల హరికిషన్ పాత కక్షలతో అసభ్యకరంగా మాట్లాడాడు. శ్రీకాంత్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరికిషన్ పై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై బీ.రాంచరణ్ శుక్రవారం తెలిపారు. ఎవరైనా సరే సోషల్ మీడియాలో అసభ్యకర పదజాలంతో దూషిస్తూ, అనవసర ప్రకటనలతో పోస్టులు పెడితే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.

దొంగతనం కేసులో ఒకరికి జైలు

డోర్నకల్: ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడి పట్టుబడిన కేసులో ఒకరికి జైలుశిక్ష పడిందని డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు శుక్రవారం తెలిపారు. 4 నెలల క్రితం సుభాష్‌వీధికి చెందిన తేజావత్ శారద ఇంట్లో చోరీ జరగగా ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తరువాత చోరీకి పాల్పడిన వ్యక్తి ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్టణం మండలం గుంటపల్లికి చెందిన భూక్యా రాంచంద్రరావుగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ఎస్సై ఝాన్సీ విచారణ జరిపి నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా అడిషనల్ జేఎఫ్‌సీఎం రెండు నెలల జైలుశిక్ష, జరిమానా విధించారని సీఐ తెలిపారు.

'వేస్ట్ టు వండర్'లో భాగస్వాములు కావాలి



మహబూబాబాద్: వేస్ట్ టు వండర్ కార్యక్రమంలో ప్రధానంగా యువత భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం ఇండియన్ స్వచ్ఛతా లీగ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే స్వచ్ఛతా హే సేవా కార్యక్రమాలకు సంబంధించిన వేస్ట్ టూ వండర్ పోస్టర్లను చైర్మన్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పనికిరాని వస్తువులతో నూతన ఆవిష్కరణలు తయారు చేసి ఈనెల 27వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎంపికైన వారికి ఈనెల 30న ప్రశంసపత్రాలను అందజేస్తామన్నారు. వివరాల కోసం 87901 55423 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కమిషనర్ ప్రసన్నరాణి, డీఈ.ఉపేందర్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్: 9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్, (S.R) : 7997958185
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646